చిన్నకథ: సామాజిక వ్యవస్థలో మార్పు

కొడవటిగంటి కుటుంబరావు

మొదటి ప్రపంచ యుద్ధానంతరం తలయెత్తిన ప్రజాస్వామిక శక్తులతో జననంపొంది, వ్యక్తివాదం యొక్క అండను అభివృద్ధిచెంది, వ్యావహారిక భాషయొక్క సహాయంతోనూ, పత్రికల విజృంభణతోనూ ప్రజలలో అమితమైన వ్యాప్తిచెందిన తెలుగు కథ దాదాపు రెండవ ప్రపంచ యుద్ధం ఆరంభమయే వరకూ అవిచ్ఛిన్నంగా సాగింది.

అయితే 1932 అనంతరం ఏర్పడిన ఆర్థిక కాటకం మొదలుకొని చిన్నకథ వెనక అండగా ఉండిన సామాజిక వ్యూహంలో కొత్త పరిణామాలు సాగాయి. ఈ పరిణామాల వైనం వెంటనే తెలియరాలేదు. వాటి కుదుళ్లు చాలా దూరానే ఉండిపోయాయి. అయినప్పటికీ చిన్నకథకు తోబుట్టువయిన భావగీతం అప్పుడే పతనం కాసాగింది. చిన్న కథ కూడా కేవలం వ్యక్తివాదాన్ని బలపరిచినంతవరకూ అధోముఖయాత్ర సాగించింది.

మానవసమాజంలో ఆ తరుణంలో ఆరంభమైన నూతన పరిణామాలేమిటో ఈనాడు మనం సులభంగా తెలుసుకోగలం.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం కొత్త మూసలోకి ప్రవేశించిన మానవసామాజిక వ్యవస్థ ఆ మూసలోనే ఘనీభవించుకుపోవటానికి బదులు తిరిగి కొలిమిలో ప్రవేశించసాగింది. ప్రజాస్వామిక శక్తుల సహాయంతో కైయిజరు జర్మనీ సామ్రాజ్య దాహాన్ని కట్టించిన డెమోక్రసీ రాజ్యాలు—బ్రిటను, అమెరికా, ఫ్రాన్సు వగైరాలు సామ్రాజ్యవాదాన్ని విడనాడనూ లేదు; ప్రజాస్వామిక శక్తులను మన్నించనూ లేదు. బ్రిటను ఇండియాకు చేసిన వాగ్దానాలకు ఫలితంగా బ్రిటిషు సామ్రాజ్యవాదం దేశంలో మరింత విలయతాండవం సాగించింది. ప్రజాస్వామికాలకూ, వ్యక్తివాదానికీ డెమోక్రసీలే గర్భవిరోధులుగా పరిణమించాయి. ఇండియాలోని ప్రజాస్వామిక శక్తులు కాంగ్రెసు అండను, గాంధీ నాయకత్వంతో సంఘర్షణ ఆరంభించాయి.

ఇటువంటి జాతీయోద్యమాలను అణచటంతో తృప్తిచెందక సామ్రాజ్యవాదులు, ప్రజాస్వామిక సూత్రాలను వల్లెవేస్తూనే, ప్రజాస్వామ్యాలమీద మరొక ధ్వజం కూడా ఎత్తారు. ప్రజాస్వామ్యాలకు గర్భశత్రువూ, సామ్రాజ్య వాదంయొక్క భీకరాతిభీకరస్వరూపమూ అయిన ఫాసిజమును ఎగదోయసాగారు. బ్రిటను, అమెరికా, ఫ్రాన్సు మొదలైన దేశాలలో హిట్లరు, ముసోలినీలకు గొప్ప ప్రచారం జరిగింది. వారికి "డెమోక్రసీలు" ధనసహాయం కూడా చేశాయి. ప్రజాస్వామ్యాలూ, వ్యక్తివాదమూ ఏమయినట్టు?

ఇదే సమయంలో ఇంకొక పరిణామం కూడా కలంపట్టి చరిత్ర లిఖించసాగింది. అది రష్యాలో జరిగిన విప్లవం. ఈ విప్లవం ప్రధానంగా పెట్టుబడిదారీ విధానాన్ని హతమార్చినా, పెట్టుబడిదారీ డెమోక్రసీలలో ఉండే వ్యక్తివాదాన్ని కూడా నిర్మూలించింది. నిజానికి, పెట్టుబడిదారీ కింద వ్యక్తివాదమంటే స్వలాభంకోరకుమాత్రమే సంపదను సృష్టించే హక్కు మాత్రమే. మిగిలిన వ్యక్తిస్వాతంత్ర్యాలన్నీ ఈ స్వాతంత్ర్యానికి ఆహుతిఅవుతూ ఉండేవి. అందుచేతనే డెమోక్రసీలలో దారిద్ర్యమూ, నిరుద్యోగమూ మొదలైన సాంఘికపీడలు నిత్యమూ ఉండేవి. మధ్యమధ్య ఉత్పత్తి మితిమీరి ఆర్థిక కాటకాలు కూడా సంభవించేవి. అటువంటి కాటకంలో ఆహారపదార్థాలు ధ్వంసం చేయబడేవికూడానూ.

మనిషిని మనిషి ఆర్థికంగా దోపిడి చేసే హక్కును రష్యావిప్లవంరష్యాలో నిర్మూలించింది. ఉత్పత్తిసాధనాలు సమాజపరం చేయబడి ఒక నిర్దిష్ట ఉత్పత్తి విధానాన్ని అనుసరించి సంపద సృష్టి కాసాగింది. నిరుద్యోగమూ, నిరక్షరతా నిర్మూలించబడ్డాయి.

1930 తరవాత పెట్టుబడిదారీ ప్రపంచాన్ని కల్లోలపరిచినఆర్థికారాటకం ఛాయలు రష్యాలో

కనిపించలేదు.

కాని రష్యాలో ప్రజాస్వామ్యాలు లేవన్నారు. రష్యా ఒక పెద్ద జైలనీ, అందులో అందరూ నిర్బంధంగా పనిచేసే బానిసలనీ, అక్కడ వాక్స్వాతంత్ర్యాదిక స్వాతంత్ర్యాలు లేవనీ, అక్కడ కొద్దిమంది నియంతృత్వం సాగిస్తున్నారనీ ప్రచారంచేశారు. హిట్లరు సర్పాన్ని పాలు పోసి పెంచినవారే ఈ ప్రచారం సాగించి ఉండటం గమనించదగిన సంగతి. అయినా ఈ ప్రచారం చాలావరకు పారిందనే చెప్పాలి.

రష్యాలోనే నిజమైన ప్రజాస్వామ్యం అమలు జరుగుతున్నదని చెప్పినవారు లేకపోలేదు. కాని వీరిగొంతు సరిగా వినిపించలేదు.

అయితే రష్యాలోని ప్రజాశక్తులు రెండవ ప్రపంచయుద్ధంలో పరీక్షకు వచ్చాయి. నియంతృత్వం వెనక ఉన్న పైశాచిక బలాన్ని రష్యా ఎదుర్కోవటానికి సిద్ధపడుతుందా, దానితో రాజీపడుతుందా? దాన్ని జయించగలుగుతుందా, లొంగిపోతుందా? జయించటానికి ఎంత స్వార్థత్యాగం చేస్తుంది?

ఈ ప్రశ్నల కన్నిటికీ రెండవ ప్రపంచ యుద్ధం సరిఅయిన సమాధానా లిచ్చింది. నియంతృత్వంకింద పీడించబడే రష్యా ప్రజలు హిట్లరు భూతాన్ని అంత గట్టిదెబ్బకొట్టి ఉండరు. డెమోక్రసీ దేశాలలోకూడా హిట్లరు అభిమానులు పైదొలగి ప్రజాస్వామిక శక్తులను బలపరుస్తూ రష్యాతో చేతులు కలపగలవారే యుద్ధం సాగించటంకూడా జరిగింది.

రెండవ ప్రపంచ సంగ్రామంలో గెలిచిన ప్రజాశక్తులే అనేక పెట్టుబడిదారీ దేశాలలో సోషలిస్టు పార్టీలను ముందుకు నెట్టాయి.

"బూర్జువా వ్యక్తివాదం" అనబడేది రెండవ ప్రపంచ యుద్ధంలో నశించిందని చెప్పాలి. దాని స్థానే ఒకవిధమైన "సోషలిస్టు సమష్టివాదం" పైకి వచ్చింది. పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తిసాధనాలు ప్రజల సమష్టి సమస్యలను పరిష్కరించలేవన్నది స్పష్టమయింది. ఆ విధానం వెంట దారిద్ర్యమూ, ప్రజాపీడనా, యుద్ధభయమూ, నిరుద్యోగమూ ఉండి తీరవలిసిందే.

ఎవడి దారిద్ర్య సమస్యను వాడు తీర్చుకో లేడు. వ్యక్తిక్షేమం సమష్టి క్షేమంమీద ఆధార పడవలిసి ఉంది. సమష్టి కృషిలోగాని వ్యక్తి కృషి రాణించదు. నిర్దిష్ట 'ఆర్థిక పథకాలు లేకుండా మామూలు ప్రజాస్వామ్యాలు కూడా అమలు జరగవు.

నిజమే, ఈ సత్యాలను ఎలుగెత్తి చాటినవారు కమ్యూనిస్టులు. ఇదే కమ్యూనిజమనుకుంటే కమ్యూనిజంలో సత్యమున్నదనైనా ఒప్పుకోవాలి. లేదా ఈ సత్యాలు గ్రహించటానికి కమ్యూనిజము అవలంబించ నవసరం లేదనైనా ఒప్పుకోవాలి. కాస్త చరిత్రజ్ఞానం ఉన్నవారు ఈ చిక్కులో పడ్డారు.

బ్రిటను ఒకవిధమైన సోషలిస్టు వ్యవస్థను అమలు జరపటానికి పూనుకున్నది. ఇతర దేశాలు కూడా అటువంటి ధోరణిలోనే పడ్డాయి. మామూలు కళాకారుడి సమస్య ఏ రాజకీయ పార్టీని బలపరచాలి, రాజకీయ విప్లవం ఎట్లా సాధించాలి అని కాకపోవచ్చు. కాని మానవ సమాజాన్ని కదిలించే నూతన శక్తులనూ, మానవ సమాజంలో జరుగుతున్న నూతన పరిణామాలనూ అవగాహన చేసుకోకుండా అతను కళారచన ఎట్లా చేస్తాడు?

కొన్నియేళ్ళ క్రితం తాను వలచిన స్త్రీకొరకు తండ్రి ఇచ్చే ఆస్తిని విసర్జించిన వాణ్ణిగురించి కథ రాసి భళీ అనిపించుకోవటం సాధ్యమయింది. లేదా తాను అభిమానించే స్నేహితుడికొరకు తాను పెళ్లాడదలచిన కన్యను త్యాగంచేసిన వాణ్ణిగురించి కథ రాసి అందులో గొప్పతనం చూపటం సాధ్యమయిపోయింది. కాని రాను రాను జీవితంలో ఇటువంటి హీరోయిజముకు స్థానంలేకుండా పోతూంటే కథకు డేంచెయ్యాలి? నిత్యజీవితంలో కళ్ళ ఎదట కనిపించే వ్యక్తులకు "త్యాగం"చెయ్యటానికి స్వార్జితాలు లేకుండా పోతూఉండే. పెళ్లాడితే పెళ్లాన్ని పోషించటం ఎట్లాగా అన్న సమస్య ఎదురవుతూఉండే— మరొకడికోసం ఆ కన్యను వదులుకోవటం మాట దేవు డెరుగు! మామూలు పౌరధర్మాలూ, వ్యక్తి ధర్మాలూ నిర్వర్తించటానికే కటకటలాడే మధ్య తరగతివాళ్లు సంఘం మెచ్చుకునే పను లెక్కడ చెయ్యగలరు?

1942 అనంతరం వ్యాప్తిచెందిన సామాజిక భావాల దృష్టితో అంతకుపూర్వం వచ్చిన

కథా సాహిత్యాన్ని చూస్తే అందులో చాలా భాగం అయథార్థంగానూ, అవాస్తవంగానూ కనిపించసాగింది. సత్యనిరతి, త్యాగబుద్ధి, ప్రజ్ఞ మొదలైన వ్యక్తి సుగుణాలు రాణించాలంటే అవతల గొప్ప సాంఘికాశయం ఉండవలసిన అగత్యం ఏర్పడింది. ఈ అగత్యం నానాటికీ హెచ్చుతున్నది.

ఈనాటి సమాజంలో సంఘవిద్రోహక శక్తులేవి? వ్యక్తి విశిష్టతా, త్యాగమూ, ధర్మబుద్ధీ, సమాజాభిమానమూ, అభ్యుదయ కాంక్షా ఈనాటి జీవితంలో ఎటువంటి స్వరూపం దాల్చగలవు? మానవజాతి ఎటుపోతున్నది? ఎటు పోవాలి? దారిద్ర్యమూ, అజ్ఞానమూ, అనారోగ్యమూ, సంకుచితత్వమూ, యుద్ధభయమూ, కులతత్వాలూ, మతతత్వాలూ—ఇటువంటి సాంఘికపీడలు నిర్మూలమై ప్రజలు స్వేచ్ఛగా, అవాంతరాలు లేకుండా, విభేదాలు పోగొట్టుకుని, తమ ఆర్థిక విజ్ఞాన నైతిక జీవితాలను గట్టి పునాదిమీద నిర్మించుకొనటానికి మార్గమేది? ఇటువంటి ప్రశ్నలకు కళాకారులు సమాధానాలు అన్వేషిస్తున్నారు. సమాధానాలు చెబుతున్నారు కూడాను.

కథలు కూడా ఈ సమస్యలకు ఏకంగా నిలబడి ఉండలేరు. ఇటువంటి ప్రశ్నలకు వీరు సరిఅయిన సమాధానం తెలుసుకున్నకొద్దీ కథలు జీవితానికి మరింత సన్నిహితంగా వచ్చి జీవిత సత్యాన్ని చిత్రించగలుగుతాయి.

ఒక్కమాట స్పష్టంగా చెప్పవచ్చు. తెలుగులో చిన్నకథ ఇంకా విస్తృతప్రజలను తన దగ్గిరికి లాగుకొంటుంది గాని ప్రజలకు దూరంగా మాత్రం వెళ్ళదు. ఇదివరకులాగా ఇది కేవలమూ వ్యక్తివాదాన్నే ఆధారం చేసుకోక సమష్టి వాదాన్ని- జీవితం తాలూకు సమష్టి స్వరూపాన్ని- బలపరుస్తూ సాగుతుంది. చిన్న కథ తెలుగులో పుట్టినప్పుడు కొత్తరకం రచయితలు సాహిత్యరంగంలో అడుగు పెట్టారని అనుకున్నాం. రెండవ ప్రపంచ యుద్ధానికి పూర్వం చైతన్యరహితంగా ఉన్న అనేక ప్రజా వర్గాలు ఇప్పుడు చైతన్యం పొందుతున్నాయి. ఈ వర్గాలలోనుంచి ఉత్తమ కథకులు ముందుకు రావలసి ఉన్నది. తెలుగులో చిన్న కథ ఇంకా ఉన్నతశిఖరాలు అందుకోవలసి ఉన్నది.

బెంగాల్ శరణార్థులు

కడచిన రెండుమూడు వారాల్లోనూ, రెండులక్షలకుపైగా శరణార్థులు తూర్పుబెంగాల్‌నుండి పశ్చిమబెంగాల్ చేరారు. ఇంకా ఎందరు వస్తారో తెలీదు: వస్తూనే ఉంటారు. క్రమంగా యీ శరణార్థుల ప్రవాహం తగ్గిపోతుందని ఎవరైనా అనుకుంటే అది కేవలం భ్రమ. ఇవాళ తూర్పు బెంగాల్ ప్రజలకు రక్షణలేదు. పశ్చిమ బెంగాల్ చేరినంత మాత్రాన వారికి సహాయం లభిస్తుందన్న హామీ ఏమాత్రం లేకపోవచ్చు. అయినా శరణార్థులు వస్తూనే ఉంటారు. తూర్పు బెంగాల్‌లో వాళ్లు పడే అవమానం, అనుభవించవలసిన నీచం, భరించలేక వస్తారు. అంతేకాదు: అక్కడి మెజారిటీవర్గం హిందువులపై పూర్తిగా కట్టుకట్టింది. హిందువుల ఆర్థిక వ్యవస్థ సర్వనాశనమైంది. అందువలన, యీ నిర్భాగ్యులైన శరణార్థులందరికీ పునరావాసం కలిగించడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వమూ, కేంద్ర ప్రభుత్వమూ, భారీ యెత్తున సన్నాహాలు చెయ్యవలసి ఉంటుంది. ఈ విషయంలో బెంగాల్ ప్రజానీకం సూటిగా ఒక ప్రశ్న వేస్తున్నారు. తూర్పు బెంగాల్‌లో మైనారిటీలకు రక్షణ కలిగించడానికి ఇండియా ప్రభుత్వం ఏ ప్రయత్నాలు చేస్తున్నది? ఈ సమస్య తేలేవరకూ పశ్చిమ బెంగాల్‌లో కాని, ఆమాటకొస్తే ఇండియాలో కాని, పరిస్థితులు, తిరిగి వాటి నిసర్గస్థితికి రానేరవు.

—[సుచేతా కృపలానీ]